

డిజిటలైజేషన్‌లో జాప్యం

మున్సిపాలిటీల పరిధిలోని ఇళ్లకు డిజిటల్ నంబర్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 8లో



నిర్లక్ష్యం నీడన కల్వర్టు

నిత్యం భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే కల్వర్టులకు మరమ్మతులు కరువయ్యాయి. 8లో



పాత భవనాలతో ప్రమాదం

పాత భవనాలు ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని ఆందోళన నెలకొంది. 9లో

న్యూస్‌రీల్

21న బీఎల్‌ఓలకు శిక్షణ

బంట్వారం: బీఎల్‌ఓలకు ఈ నెల 21న బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, అష్ఫక్ రసూల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పై రెండు మండలాలకు సంబంధించిన బీఎల్‌ఓలు వేర్వేరుగా నిర్వహించే శిక్షణ తరగతులకు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలో కాంట్రాక్ట్ పోస్టులు

అనంతగిరి: ఎస్పీ కార్యాలయంలోని భరోసా సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేసేందుకు సెంటర్ కోఆర్డినేటర్, లీగల్ అడ్వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాది పాటు వీరి సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

24న 'కథ చెబుతారా.. ఊ కొడతాం'



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తాండూరు టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం వారి సౌజన్యం, జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 'కథ చెబుతారా... ఊ కొడతాం' పేరుతో ఈనెల 24న నీతి కథల పోటీలు నిర్వహించనున్నారు. తాండూరులోని శ్రీనేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాలలో ఉదయం 11 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. జూనియర్స్ విభాగంలో ఐదు నుంచి పదేళ్ల లోపు చిన్నారులు, సీనియర్స్ విభాగంలో పది నుంచి పదిహేనేళ్లలోపు వారు పోటీల్లో పాల్గొనవచ్చు. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి చారిత్రాత్మక కథల నుంచి రెండు నుంచి ఐదు నిమిషాల వ్యవధిలో నీతి కథ చెప్పాలి. వివరాలకు 90308 50336 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కో ఆర్డినేటర్ గూడూరు హరినాథ్, నేతాజీ స్కూల్ డైరెక్టర్ మణిమాల, ప్రిన్సిపల్ శివలీల, ఉపాధ్యాయులు సూచించారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన జిల్లా అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆనంద నిలయం డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు మేళాను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ అర్హతలు ఉన్న 18 నుంచి 30 ఏళ్లలోపు అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 50 పోస్టులకు సెలెక్షన్స్ ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 9676047444 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీసీఎస్ సీఐగా బాలస్వామి బాధ్యతల స్వీకరణ



ఎస్పీని కలిసిన సీసీఎస్ సీఐ

అనంతగిరి: సీసీఎస్ సీఐగా బాలస్వామి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా ఎస్పీ కోటిరెడ్డిని కలిశారు.

రివార్డుల అందజేత

ధారూరు, కొడంగల్ పీఎస్ పరిధిలో గంజాయి కలిగిన ఉన్న నిందితులను పట్టుకుని కేసు నమోదు చేసిన టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్, కానిస్టేబుల్ రమేశ్, రాంచందర్, బాలు, భాస్కర్, సురేశ్‌కు ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ నియామకం కోసం ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రభు కోరారు. తెలుగు, హిస్టరీ, క్రాప్ ప్రొడక్షన్లకు ఒక్కొక్క పోస్టు, కంప్యూటర్ సైన్స్‌కు రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సంబంధిత పీజీ కోర్సులో 55 శాతం, ఎస్సీ,ఎస్టీలు 50 శాతం కలిగి ఉండాలన్నారు. వివరాలకు 94405 71781 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

జోరు వాన

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- పంటలకు జీవం
- చెరువులు, కుంటల్లోకి కొత్తనీరు
- పరిస్థితిపై కలెక్టర్, ఎస్పీ ఆరా
- అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగానికి ఆదేశాలు

వికారాబాద్: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలకు జీవం పోసినట్టయింది. ఎడతెరిపి లేకుండా రోజంతా కురుస్తోంది. దీంతో రైతన్నకు కాస్త ఉపశమనం లభించింది. వర్షాకాలం ఆరంభం నుంచి మొదటి సారిగా అన్ని మండలల్లో వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటలుగా భారీగా కురవకపోయినా ఎడతెరిపి లేకుండా పడుతోంది. ఫలితంగా వాగులు పారుతూ చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతోంది. పూడూరు మండలంలో 28.3 మిల్లీమీటర్లు, పెద్దేముల్ 24ఎంఎం, తాండూరు 23.8 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది. బొంరాస్‌పేటలో అత్యల్పంగా 0.13 వర్షపాతం నమోదైంది.

రైతుల్లో ఆనందం

వర్షాకాలంలో ఇప్పటి వరకు పంటలకు సరిపడా వర్షం కురవలేదు. అప్పుడప్పుడు కురిసినా ఒక ప్రాంతంలో కురిసి మరో ప్రాంతాల్లో కురవలేదు. దీంతో చెలకలు, ఇసుక పొలాల్లో మొక్కజొన్న తదితర సగం మొలకెత్తగా మిగతావి మొలకెత్తలేదు. వెంటవెంటనే వర్షాలు కురవకపోవటంతో కొన్ని చోట్ల పంటలు పాడవగా రేగడి పొలాల్లో కొలుకునే అవకాశం ఉంది. ఇదే సమయంలో ప్రస్తుతం వరినాట్లు వేసుకునే సీజన్ కూడా ప్రారంభం కావటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ వర్షాలతో బోరు బావుల్లో, చెరువుల్లో మరింత నీరు పెరిగి నాట్లు ఊపందుకోనున్నాయి.

అధికారులు అప్రమత్తం

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. అటు రెవెన్యూ, ఇటు పోలీసు యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. వరదల కారణంగా తీవ్రంగా ప్రాణనష్టం జరిగిన నేపథ్యంలో కింది స్థాయి వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి సమీక్షించారు. అధికారులకు, ఇతర యంత్రాంగానికి సూచనలు చేశారు. మొత్తం 20 రోడ్ల పరిధిలో 26 చోట్ల ప్రమాదం జరిగే అవకాశం ఉన్నట్టు యంత్రాంగం గుర్తించింది. జిల్లాలో 1179 చెరువులు, కుంటలు ఉండగా వాటిలోకి నీరు చేరటం ప్రారంభమైంది. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి కాలనీలు మడుగులను తలపిస్తున్నాయి. రోడ్లన్నీ బురదమయంగా మారాయి.

గోవిందరావుపేట చెక్‌డ్యాంకు జలకళ

యాలాల: మండల పరిధిలోని గోవిందరావుపేట శివారులో కాకరవేణి నదిపై నిర్మించిన చెక్‌డ్యాం వరదనీటితో కళకళలాడుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాకరవేణి నదిలో ఎగువనుంచి వరదనీరు రావడంతో చెక్‌డ్యాం నిండుకుండలా మారింది. 2020లో గోవిందరావుపేట సమీపంలోని నదికి అడ్డుగా చెక్‌డ్యాం నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ రూ.5.75 కోట్లు మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు నిదానంగా సాగుతూ వచ్చాయి. ఇటీవల చెక్‌డ్యాం కట్ట పనులు దాదాపు పూర్తి కావడంతో ఎగువన భారీగా వరదనీరు నిలిచింది. చెక్‌డ్యాం నుంచి ఎగువన విశ్వనాథ్‌పూర్ బ్రిడ్జి వరకు వరదనీరు చేరింది. చెక్‌డ్యాంలో నిలిచిన నీటితో 140 ఎకరాల ఆయకట్టుతో పాటు రెండు కిలో మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. చెక్‌డ్యాంలో నిలిచిన నీటితో ఆయకట్టు రైతుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



యాలాల: చెక్‌డ్యాంలో భారీగా చేరిన వరదనీరు

జాబితా సిద్ధం చేయండి

- ప్రతి ఓటరు దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమీక్షలో కలెక్టర్ నారాయణ రెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎలక్షన్ లాగిన్‌లో మంగళవారం వరకు వచ్చిన ప్రతిదరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలకు ముందు ఎన్నికల లాగిన్ లో పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకొని పూర్తి చేయాలన్నారు. ఓటరు జాబితా నుంచి చనిపోయిన, డబుల్ ఓట్లుగా నమోదైన వాటిని తొలగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 8,500 దరఖాస్తులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పొరపాటుగా తొలగింపునకు గురైన ఓటర్లను మరోసారి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో శిక్షకులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ నెల 22 లోపు శిక్షణ పూర్తి కావాలన్నారు. ధరణి వెబ్‌సైట్‌లో వంద శాతం ఆప్షన్లు వచ్చాయని, ఇకనుంచి సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి మండలం నుంచి రోజుకు కనీసం 30 దరఖాస్తులను కలెక్టరేట్‌కు పంపించాలని తహసీల్దార్లకు సూచించారు. కార్యక్రమంలో ఎలక్షన్ రిటర్నింగ్ అధికారులు, ఈఆర్వోలు, ఏఈ ఆర్‌ఓలు, డీటీలు పాల్గొన్నారు.

పారదర్శకంగా రూపొందించాలి

ప్రతీ ఇంటిని పరిశీలించి ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. మంగళవారం భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, విధి విధానాలపై కలెక్టరేట్‌లో బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి, తగిన ఆధారాలతో చర్యలు తీసుకోవాలన్నారు.

నులిమేద్దాం.. చిన్నారులను రక్షిద్దాం

- నట్టల నివారణ మాత్రలను బాధ్యతగా వేయించాలి
- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: చిన్నారులకు బాధ్యతగా నట్టల నివారణ మాత్రలు వేయించాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం జాతీయ నులి పురుగుల నివారణపై నిర్వహించారు. ఈ మావేశానికి హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 19 ఏళ్లలోపు పిల్లలకు నట్టల నివారణకు ఆల్‌బెండాజోల్ మాత్రలు వేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలతో పాటు, అంగన్‌వాడీ, జూనియర్ కళాశాలలు, మదర్సాలు, ఆశ్రమ పాఠశాలలో మాత్రలు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ నెల 20న నిర్వహించే నులి పురుగుల నివారణ దినోత్సవంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు మాత్రలు వేసే విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు వేయడంపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మండల స్థాయిలో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామ స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అలాగే 5 ఏళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన ఇంద్రధనస్సు టీకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వాన్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో ఎంతో మేలు

- రేషన్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్



ఫోర్టిఫైడ్ బియ్యంపై వివరిస్తున్న జిల్లా అధికారి

వికారాబాద్ అర్బన్: పౌష్టికాహార బియ్యం (ఫోర్టిఫైడ్ బియ్యం) తింటే రక్తహీనతతో పాటు శరీరంలో నీరసం తగ్గి చురుకుదనం పెరుగుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు చౌకధర దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగంతో ఎంతో మేలు జరుగుతుందనే విషయాన్ని డీలర్లు లబ్ధిదారులకు చెప్పాలన్నారు. జిల్లాలోని 588 చౌక ధరల దుకాణాల ద్వారా 2,41,260 మంది రేషన్ కార్డు వినియోగదారులకు ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తున్నామన్నారు. జిల్లాకు 5,363 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యం ఎంతో పోషకాలతో కూడుకున్నవని, వంద కిలోల మామూలు బియ్యంలో ఒక కేజీ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతారన్నారు. ఈ బియ్యాన్ని లబ్ధిదారులు కచ్చితంగా ఉపయోగించుకోవాలన్నారు.

రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యుడే

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు ఎత్తేయడం ఖాయం
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

పూడూరు: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నారా చంద్రబాబునాయుడి శిష్యుడేనని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు బీమా, రైతు బంధు పథకాలను ఎత్తేయడం ఖాయమని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చన్గోముల్‌లో చేవెళ్ల ఆరోగ్య రథాన్ని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య రథాన్ని ప్రారంభించామన్నారు. ఆరోగ్య రథ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంట్ సరిపోతుందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో ఉచిత విద్యుత్తు ప్రస్తావన లేదన్నారు. మూడు గంటలు ఇచ్చే కాంగ్రెస్ కావాలా.... మూడు పంటల బీఆర్ఎస్ కావాలా అనేది ప్రజలు తేల్చుకోవాలని అన్నారు. రాష్ట్రంలో రైతుల అవసరాల మేరకే విద్యుత్తు కొంటున్నామని అన్నారు. పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిత్యం తపించే వ్యక్తి ఎంపీ రంజిత్‌రెడ్డి అని అన్నారు. సొంత డబ్బులతో ఆరోగ్య రథాన్ని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, మార్కెట్‌కమిటీ చైర్మన్ అజారుద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రహీస్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టు.. రావాలి పట్టు

- విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు చర్యలు
- ఈఏడాది కూడా కొనసాగింపు
- ఈ నెల 21 నుంచి ఆర్పీలకు, ఎంఈఓలకు శిక్షణ



సామర్థ్యాల పెంపు పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించాలనే ఉద్దేశంతో గత ఏడాది విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో నైపుణ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. గత ఏడాది ఆశించిన మేర ఫలితాలు రావడంతో ఈ ఏడాది కూడా పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచేందుకు గతంలో త్రీ ఆర్స్, ఏబీసీ పేరుతో కార్యక్రమాలు నిర్వహించింది. అయినా ఫలితాలు అంతగా రాలేదు. పర్యవేక్షణ లోపంతో పాటు, రెండేళ్ల కరోనా కారణంగా విద్యార్థులు ప్రత్యక్ష తరగతులకు దూరం కావడం కూడా ఓ కారణంగా చెప్పవచ్చు. ఈ రెండింటికీ భిన్నంగా గత ఏడాది తొలిమెట్టుతో విద్యార్థుల్లో కనీస సమర్థ్యాలు పెంచేందుకు చర్యలు చేపట్టింది.

మూడు రోజుల శిక్షణ పూర్తి

ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమం ఎలా అమలు చేయాలనే దానిపై జిల్లా స్థాయి ఆర్పీలకు మూడు రోజులు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన ఆర్పీలు ఈ నెల 21 నుంచి ఆయా మండలాల ఆర్పీలకు, సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. తొలిమెట్టు కార్యక్రమం పర్యవేక్షణకు ఆ మండలంలోని సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయున్ని నోడల్ అధికారిగా నియమించారు. వారంలో రెండు సార్లు పాఠశాలలను సందర్శించి సామర్థ్యాల పెంపును పరిశీలించాల్సి ఉంటుంది. ఈ మేరకు మంగళవారం మండల విద్యాధికారులు, ఆర్పీలతో డీఈఓ సమీక్ష నిర్వహించారు.

ఒకటి నుంచి 5వ తరగతి వరకు..

గతంలో అమలు చేసిన త్రీ ఆర్స్, ఏబీసీ కార్యక్రమాలు 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అమలు చేశారు. గత ఏడాది చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమం మాత్రం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఒకటి నుంచి 5వ తరగతి వరకు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం లిప్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. రెండో ఏడాది తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

పకడ్బందీగా అమలు చేస్తాం



ఈ ఏడాది తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తొలిమెట్టు కార్యక్రమంతో విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెరుగుతాయి. జిల్లా స్థాయి ఆర్పీలకు శిక్షణ పూర్తయింది. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయి ఆర్పీలకు శిక్షణ ఉంటుంది. ఆ తరువాత పాఠశాల స్థాయిలో 50శాతం మేర ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తాం.

– రేణుకాదేవి, డీఈఓ

60వేల మందికిపైగా విద్యార్థులు

జిల్లాలో 764 ప్రాథమిక పాఠశాలలు ఉండగా అందులో 47,459 మంది విద్యార్థులు ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. అదేవిధంగా 116 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 12,210 మంది విద్యార్థులు చదువుతున్నారు. తొలిమెట్టు కార్యక్రమంతో సుమారు 60వేల మంది విద్యార్థుల కనీస సామర్థ్యాలు అంచనావేయనున్నారు.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'మంత్రి కేటీఆర్ స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు. సీఎం కొడుకుననే అహంకారంతో వ్యవహరిస్తున్నారు. క్లబ్బులు, పబ్బులు అంటూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లి గాంధీ భవన్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు సుధీర్‌రెడ్డి, గౌరి సతీష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డ్రగ్స్ కేసు విషయంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించే దమ్ము, ధైర్యం లేని మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేతపై అవాకులు, చవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు. తండ్రీకొడుకులకు రాజకీయ భిక్ష పెట్టిన రాజీవ్, సోనియాగాంధీ వారసులను కించపరిచేలా మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నేతలు షాబాద్ దర్శన్, చల్లా బాల్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వికసించిన బ్రహ్మకమలం



విరబూసిన బ్రహ్మకమలం

తాండూరు టౌన్: పట్టణంలోని భవానీ నగర్‌కు చెందిన ఎం మల్లేశం ఇంట్లో సోమవారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. ఏడాదికి ఒక్కసారి మాత్రమే బ్రహ్మకమలం పూస్తుంది. మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు. బ్రహ్మకమలం తమ ఇంట్లో విరబూయడం అదృష్టంగా భావిస్తున్నట్లు మల్లేశం కుటుంబ సభ్యులు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

కొడంగల్ రూరల్: మండలంలోని రావులపల్లి చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ సైదులు కథనం మేరకు.. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గోవా నుంచి వచ్చిన వాహనంలో 6 ఫుల్ బాటిళ్ల మద్యం ఉన్నట్లు గుర్తించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

నేటి బస్సుయాత్రను విజయవంతం చేయాలి



జంగయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు జంగయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన జంగయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు భీంరెడ్డి, ఆంజనేయులు, గోపాల్ నాయక్, అంజిలయ్య, ఆనందం, షర్పొద్దీన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన రామన్న



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామన్న మాదిగ

దోమ: మండలంలోని బొంపల్లికి చెందిన తెలంగాణ ఉద్యోమకారుడు, ఆర్‌పీఐ పార్టీ ప్రచార కార్యదర్శి పి.రామన్న మాదిగ సోమవారం కేంద్ర మంత్రి రాందాస్ అతవలేని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళిత, బహుజనులపై జరుగుతున్న దాడులను నియంత్రించేలా కృషి చేయాలని విన్నవించారు. రాష్ట్రంలో ఆర్‌పీఐ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

'కోట్‌పల్లి' వద్ద ఆటోమేటిక్ వాటర్ లెవల్ రికార్డర్



ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన రికార్డర్

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగుకు ఎడమ వైపు ఆటోమేటిక్ వాటర్ లెవల్ రికార్డర్‌ను ఏర్పాటు చేశారు. అంతకుముందే బేబి కెనాల్ వద్ద ఆటోమేటిక్ వాటర్ లెవల్ రికార్డర్‌ను పూర్తి చేశారు. సెన్సార్ల సహాయంతో అలుగుపై నుంచి ఎంత ఎత్తులో నీటి ప్రవాహం పోతుంది అనే విషయం స్పష్టంగా తెలుసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

డిజిటలైజేషన్‌లో జాప్యం



కొడంగల్ మున్సిపల్ కార్యాలయం

- ఇళ్లకు నంబర్ల కేటాయింపులో ఆలస్యం
- ప్రభుత్వం ఆదేశించినా అమలు కాని వైనం
- అనుసంధానం కాని క్యూఆర్ కోడ్
- పురపాలికల ఆదాయానికి గండి

కొడంగల్: మున్సిపాలిటీల పరిధిలోని ఇళ్లకు డిజిటల్ నంబర్లు ఇవ్వాలని ప్రభుత్వం గత ఏడాది నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేసి ఏడాది ముగిసింది. ఇప్పటికీ ఈ దిశగా ముందడుగు వేయలేదు. ప్రతి ఇంటికీ డిజిటల్ క్రమ సంఖ్య ఏర్పాటు చేయాలని ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఏడాది క్రితం పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది ఇల్లు, వ్యాపార సముదాయాల వివరాలను సేకరించారు. కానీ ఇంత వరకు ఒక్క ఇంటికి డిజిటల్ క్రమ సంఖ్య ఇవ్వలేదు. ఈ ప్రక్రియలో పురోగతి లేదు. ఇళ్లకు డిజిటల్ నంబర్లు ఎప్పుడు కేటాయిస్తారో అధికారులకు కూడా తెలియడం లేదు. ఇదిలా ఉండగా ప్రత్యేక రాష్ట్ర అవతరణ అనంతరం పట్టణాలు వేగంగా విస్తరించాయి. అందుకు తగ్గట్లు ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి. వికారాబాద్‌వ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఇంటి నంబర్లు సక్రమంగా లేవని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా పన్ను చెల్లించడంతో కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలాంటి వారి నుంచి ఆస్తి పన్ను వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఇంటిని గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం చేసి డిజిటల్ సీరియల్ నంబర్లు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గతంలో పట్టించుకోలేదు

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో గతంలో ఇచ్చిన ఇంటి నంబర్లు గందరగోళంగా ఉన్నాయి. మొదట ఒక నంబరు ఇచ్చి తర్వాత కట్టిన ఇళ్లకు బై నంబర్లు ఇచ్చారు. ఇళ్ల సంఖ్య పెరిగే కొద్దీ బై నంబర్లు సైతం పెరిగాయి. నంబర్ల గజిబిజి వల్ల మున్సిపల్ అధికారులు సైతం ఇంటి పన్ను వసూలు చేయడంలో ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల వివరాలు తెలుసుకోడానికి కష్టంగా ఉంది. ఈ గందరగోళానికి స్వస్తి పలికేందుకు ప్రభుత్వం గతేడాది నిర్ణయించింది. డిజిటలైజేషన్‌ను ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించినా ఇంత వరకు పూర్తి కాలేదు.

ఎక్కువ అంతస్తులు ఉంటే..

మున్సిపాలిటీల పరిధిలో చాలా మంది పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. రెండు, మూడు అంతస్తుల భవనాలు ఉన్న వారు కేవలం కింది పోర్షన్‌కు మాత్రమే పన్నులు చెల్లిస్తున్నారు. మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా పై అంతస్తులు నిర్మించారు. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి మున్సిపాలిటీల్లో ఇళ్లకు డిజిటల్ నంబర్లు వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. అది పూర్తిగా అమలు అయితే ఆదాయం పెరుగుతుంది.

పిన్ కోడ్ తరహాలో..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో నివాస గృహాలకు గూగుల్ మ్యాప్ ఆధారంగా డిజిటల్ నంబర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. పాత నంబర్ల స్థానంలో అక్షాంశాలు రేఖాంశాల దిశలను గుర్తిస్తూ వరుస క్రమంలో కొత్తవి కేటాయిస్తారు. ఆంగ్ల అక్షరాలతో పాటు నంబర్లతో కూడిన సంఖ్యను సులభంగా గుర్తించేలా డిజిటల్ నంబర్ ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే పిన్‌కోడ్, వాహన నంబర్ మాదిరిగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ముందుగా రాష్ట్రం, జిల్లా, మున్సిపాలిటీ, వార్డు ఇలా కోడ్‌ల వారీగా సంఖ్యను ఇంటి యజమానికి కేటాయిస్తారు. అపార్టుమెంట్లకు ఒకే సంఖ్య ఇచ్చి చివర్లో ఇంటి, ఫ్లాట్ నంబర్ జోడిస్తారు. డిజిటల్ నంబర్‌ను ఇంటర్నెట్‌లో అనుసంధానిస్తే సులభంగా తెలుస్తుంది. భవిష్యత్తులో గూగుల్ మ్యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అంతేకాకుండా ఈ సంఖ్యతో పాటు ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేసి పన్నులు చెల్లించే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. అత్యవసర పరిస్థితిలో అగ్నిమాపక సిబ్బంది పోలీసులు ఇంటికి చేరుకోడానికి సులభంగా ఉంటుంది. ఇప్పటికైనా ఇళ్లకు డిజిటల్ నంబర్ల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది.

నేడు జెడ్పీ సమావేశం

అనంతగిరి: వికారాబాద్ జెడ్పీ సాధారణ సమావేశం బుధవారం మున్సిపల్ పరిధి లోని మద్గుల్ చిట్టంపల్లి డీపీఆర్‌సీ భవనంలో జరగనుంది. ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అధ్యక్షతన సమావేశం జరగనుంది. ముఖ్య అతిథిగా మంత్రి సబితారెడ్డి హాజరుకానున్నారు.

భార్య హత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

నందిగామ: మద్యం మత్తులో భార్యపై దాడి చేసి హత్య చేసిన భర్తకు జిల్లా న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. నందిగామ సీఐ సురేశ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఈదులపల్లికి చెందిన నర్సింహ, విజయలక్ష్మి(35) భార్యాభర్తలు. వీరు భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. 2020 డిసెంబర్ 18న రాత్రి భిక్షాటన చేయగా వచ్చిన డబ్బుతో మద్యం సేవించాడు. ఈ విషయంలో దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో తాగిన మైకంలో ఉన్న నర్సింహ భార్యపై కర్రతో దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. ఈ విషయమై అప్పటి సీఐ రామయ్య కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసును పరిశీలించిన జిల్లా కోర్టు జడ్జి హరికృష్ణ భూపతి మంగళవారం నిందుతుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

నిధులు లేక నిరుత్సాహం

- ఏడాదిగా జీపీలకు అందని ఎస్ఎఫ్‌సీ నిధులు
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం: సర్పంచులు



గంజిపల్లి పంచాయతీ కార్యాలయం

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. 11 నెలలుగా జీపీలకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు విడుదల కాలేదు. దీంతో పంచాయతీల్లో రోజు వారి కార్యక్రమాలు పారిశుద్ధ్య పనులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు డబ్బులు లేక సర్పంచులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. జీపీలకు ఆస్తి పన్ను, ఇతర రూపాల్లో సొంతంగా సమకూరిన ఆదాయాన్ని వినియోగించుకునేందుకు వీలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో సర్పంచుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) కలపి జిల్లాకు దాదాపు రూ. 10కోట్లు వచ్చేవి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులే విడుదలవుతున్నాయి. ఎస్ఎఫ్‌సీ నిధులను పంచాయతీకి సంబంధించిన విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ల నెలవారీ అద్దెలు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాల చెల్లింపు, వీధి దీపాలు మరమ్మతులు వంటి వాటికి ఖర్చు చేస్తారు. పంచాయతీలకు 11 నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో సర్పంచులు నిరాశతో ఉన్నారు. అభివృద్ధి కోసం ఉంచిన నిధులను ట్రాక్టర్ల కిస్తీలు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు వెచ్చించాల్సి వస్తోందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల లేమితో పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి కుంటుపడుతోంది



రాష్ట్ర ప్రభుత్వం నుంచి 11 నెలలుగా ఎస్ఎఫ్‌సీ నిధులు మంజూరు కాలేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. పారిశుద్ధ్య పనులు సక్రమంగా సాగడం లేదు. అన్ని రకాల పనులు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రావడం లేదు. అప్పులు కట్టలేక నానా అవస్థలు పడుతున్నాం. గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులను విడుదల చేయాలి.

– రజిత, చిట్యాల సర్పంచ్

త్వరలో నిధులు

నిధులు పెండింగ్ ఉండడం నిజమే. ప్రభుత్వానికి నివేదిక పంపాం. త్వరలో జీపీలకు నిధులు మంజూరవుతాయి. ప్రతి నెలా 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఎస్ఎఫ్‌సీ నిధులు కూడా త్వరలో జమ అవుతాయి.

– తరుణ్‌కుమార్, డీపీఓ, వికారాబాద్

రైతులకు అండగా కేసీఆర్

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. గత పాలకుల కాలంలో రైతులు ఎన్ని కష్టాలు పడ్డారో తెలిసిందేనన్నారు. తెలంగాణ వచ్చాక కరెంట్ కష్టాలు దూరం అయ్యాయని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతాంగం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందని అన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, సర్పంచులు కమాల్‌రెడ్డి, మాధవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కురుములకు ప్రాధాన్యత కల్పిస్తాం

అనంతగిరి: కురుములకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కురుమ సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలో కురుమ భవన్ ఏర్పాటుకు కృషి చేయాలని, దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ బొండల సువర్ణ, నాయకులు కృష్ణ, బొండల శ్రీనివాస్, గోపాల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు



పెద్దేముల్ తండాలో కూలిన ఇల్లు



మోమిన్‌పేటలో..

పెద్దేముల్: మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఏక ధాటిగా కురిసిన వర్షానికి పెద్దేముల్ తండాలో ఓ ఇల్లు కూలిపోయింది. తండాకు చెందిన ముడావత్ సంతు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇల్లు కూలే సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: పట్టణంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన పట్లూరి నర్సింలుకు చెందిన ఇల్లు వెనుక భాగం పూర్తిగా కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని నర్సింలు కోరారు.

ఈద్గా నిర్మాణానికి భూమిపూజ



ఈద్గా నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దోమ: మండలంలోని ఐనాపూర్‌లో రూ. 3లక్షల ఎస్‌డీపీ నిధులతో ఈద్గా నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ మల్లేశ్ ఆధ్వర్యంలో మైనార్టీ విభాగం అధ్యక్షుడు సర్దార్, ఉపాధ్యక్షుడు ఎంఏ రహూఫ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు జలీల్ తదితరులు పాల్గొన్నారు.

సముచిత స్థానం కల్పిస్తాం

పరిగి: బీఆర్ఎస్‌లో చేరిన ఇతర పార్టీల నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండలం మోత్కూర్, కుల్కచర్ల మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 30 మంది మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో ఎంతో మంది చేరుతున్నారని తెలిపారు.

దర్గా దర్శనానికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

బంగారు, వెండి ఆభరణాలు, రూ.80వేల నగదు చోరీ

పహాడీషరీఫ్: హజ్మీర్ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్‌లైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వాదే ముస్తఫాకు చెందిన జావెద్ కుటుంబంతో కలిసి హజ్మీర్ దర్గా దర్శనానికి వెళ్లాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక నుంచి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన అర తులం బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.80 వేల నగదును ఎత్తుకెళ్లారు. తలుపులు తెరిచి ఉన్న విషయాన్ని గమనించిన స్థానికులు జావెద్ కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తూరు: డీసీఎంను బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ మంగళవారం తెలిపిన వివరాలు.. కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన అంజయ్య (36) మండల కేంద్రంలోని ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 17న రాత్రి విధులు ముగించుకుని తన బైక్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇన్ముల్‌నర్వ శివారులోకి రాగానే ముందు వెళ్తున్న డీసీఎం ఒక్కసారిగా నెమ్మదించింది. దీంతో వెనుక వస్తున్న బైక్ డీసీఎంను ఢీకొట్టడంతో అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఉస్మానియాకు తరలించగా చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్‌వి మోసపూరిత ప్రకటనలు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



కుల్కచర్ల రైతు వేదిక వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: రైతాంగ అభ్యున్నతిపై బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. మంగళవారం కుల్కచర్ల రైతువేదిక వద్ద ప్రభుత్వ తీరుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా కనీసం 9గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉచిత ఎరువులు కూడా ఇవ్వడం లేదన్నారు. లక్ష రూపాయల రుణమాఫీ ఎందుకు అమలు చేయలేదో రైతులకు వివరించాలని డిమాండ్ చేశా రు. ఎన్నికల సమయంలో మాయ మాటలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడం బీఆర్ఎస్‌కు అవాటైపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్య, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాంచందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు షర్పొద్దీన్, కృష్ణయ్య, భరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడన కల్వర్టు



పరిగి - మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై దెబ్బతిన్న కల్వర్టు

- ఏడాదిగా మరమ్మతులకు నోచుకోని వైనం
- తరచూ ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

దోమ: నిత్యం భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే కల్వర్టులకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని బాస్‌పల్లి, గొడుగోనిపల్లి గ్రామాల సమీపంలోని పరిగి – మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై గల కల్వర్టు ఏడాది క్రితం కురిసిన వర్షాలకు ధ్వంసమైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. దెబ్బతిన్న కల్వర్టును గతంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పరిగి – మహబూబ్‌నగర్ రోడ్డు కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతే తప్ప మరమ్మతులు చేయరా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. భారీ వర్షాలు పడితే కల్వర్టు పూర్తి స్థాయిలో తెగిపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు



కల్వర్టు తెగి ఏడాది కావస్తోంది. కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. ఈ విషయంపై ఎన్నో సార్లు ఫిర్యాదులు చేశాం. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కల్వర్టు వద్ద గుంతలు పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వర్షం పడితే కల్వర్టు తెగిపోయే ప్రమాదం ఉంది. వెంటనే పనులు ప్రారంభించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– శ్రీనివాస్, దొర్నాల్‌పల్లి

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



తాండూరు టౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న పంచాయతీ కార్మికులు



పరిగి: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

తాండూరు టౌన్: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు కోరారు. మంగళవారం పట్టణం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. న్యాయమైన 17 డిమాండ్ల సాధన కోసం 13 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్, నాయకులు నర్సింహులు, జగన్, జిలానీ, దస్తప్ప, శ్యామప్ప, లక్ష్మి, బాలమణి, శాంతమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

పరిగి: కార్మిక సమస్యలు పరిష్కరించాలంటూ పంచాయతీ కార్మికులు మంగళవారం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. స్పందించి ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.